ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
గురువారం 11 ఏప్రిల్ 2024







"మన పార్టీ కార్యకర్తలను వలంటీర్లుగా నియమించుకున్నాం. జనం కట్టే పన్నులతో నెలనెలా రూ.5వేలు జీతం ఇస్తున్నాం. అవి ఉద్యోగాలని మనం తెగ ప్రచారం చేస్తున్నాం. నిన్నటి వరకు వలంటీర్లు మన వెంట ఉన్నారనుకున్నాం. ఎన్నికల వేళ రాజీనామా చేసి ప్రచారానికి రావాలని ఒత్తిడి తెస్తే.. వలంటీర్ల నుంచి స్పందన అంతంతమాత్రమే.. వలంటీర్లే సీఎం జగన్‌ను నమ్మకపోతే.. ఇక జనం ఎందుకు నమ్ముతారు" అని వైసీపీ నేతలు కలవరపాటుకు గురవుతున్నారు. డామిట్ కథ అడ్డం తిరిగిందంటూ గుసగుసలాడుకుంటున్నారు.

నో అంటున్నారు..!

- వలంటీర్లపై వైసీపీ ఒత్తిడి
- రాజీనామా చేసి ప్రచారాల్లోకి రావాలని ఆదేశం
- స్పందన అంతంత మాత్రమే
- టీడీపీ అధికారంలోకి వస్తే రూ.10వేలు ఇస్తానంటూ చంద్రబాబు హామీ
- పునరాలోచనలో వలంటీర్లు
- జిల్లాలో ఉండే వలంటీర్లు 10,694
- రాజీనామా చేసింది 575

(కడప-ఆంధ్రజ్యోతి): జగన్ సర్కారు వచ్చిన తర్వాత సచివాలయాలు ఏర్పాటయ్యాక గ్రామీణ ప్రాంతాల్లో 50 కుటుంబాలకు ఒకరు, పట్టణ ప్రాంతాల్లో 100 కుటుంబాలకు ఒకరు చొప్పున వలంటటీర్లు నియమించుకున్నారు. ఇక జిల్లాలో కడప కార్పొరేషన్, ప్రొద్దుటూరు మున్సిపాలిటీ, జమ్మలమడుగు బద్వేలు, మైదుకూరు, యర్రగుంట్ల, పులివెందుల మున్సిపాలిటీ నగరపంచాయతీలు ఉన్నాయి. మొత్తం కలిపి జిల్లా వ్యాప్తంగా 10,694 మంది వలంటీర్లు ఉన్నారు.

ఇన్నాళ్లు వైసీపీ ఆదేశం.. వలంటీర్ల ఆచరణ

పింఛన్‌తో సహా సంక్షేమ పథకాలన్నీ వలంటీర్ల ద్వారా డోర్ డెలివరీ చేస్తున్నామంటూ జగన్ సర్కారు చెబుతోంది. వారికిచ్చే వేతనం రూ.5వేలే. పనిభారం మాత్రం ఎక్కువ. వారి సేవలకు ఆ జీతం తక్కువ అంటున్నారు. వీరిని వైసీపీ కార్యకర్తల్లాగా స్థానిక నేతలు ఉపయోగించుకుంటూ వస్తున్నారు. వైసీపీ నేతలు చెప్పినప్పుడల్లా చెప్పిన పనల్లా వలంటీర్లు పనిచేశారు. వారి పరిధిలోని కుటుంబాల సమస్త సమాచారాన్ని సేకరించారు. చేసే పని, తినే ఫుడ్, గొడవలు, తాగుబోతులు, ఏ పార్టీకి అనుకూలం, కులాల వారీగా.. ఇలా కుటుంబాల్లోని ప్రతి అంశాన్ని సేకరించారు. వలంటీర్లతో ఎన్నికలు నిర్వహించుకోవాలని వైసీపీ నేతలు భావించారు. సీఎం జగన్‌తో పాటు కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, సర్పంచులు పెట్టే మీటింగులకు కూడా వలంటీర్ల ద్వారా జనాన్ని తరలించారు. సభలకు రాకపోతే సంక్షేమ పథకాలు కట్ అంటూ వీరు జనాన్ని భయపెట్టి మరీ సభలకు తీసుకొచ్చారు. వలంటీర్ల వన్‌సైడ్ వ్యవహారంపై తీవ్ర దుమారం రేగుతూ వచ్చింది. ప్రతిపక్షాలు ఈసీకి ఫిర్యాదు చేయడంతో వలంటీర్లను ఎన్నికల విధుల నుంచి తొలగించింది.

డామిట్.. కథ అడ్డం తిరిగింది

ఎన్నికల ప్రచారంలో పాల్గొనవద్దు అని ఈసీ చెప్పినప్పటికీ కొందరు అత్యుత్సాహంతో ప్రచారాల్లో పాల్గొన్నారు. కడప, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు నియోజకవర్గాల్లో ప్రచారంలో పాల్గొన్న వారిపై ఈసీ వేటు వేసింది. "మీరేం భయపడవద్దు.. మీరు రాజీనామా చేయండి, మీకు డబుల్ జీతం ఇస్తాం" అంటూ ప్రొద్దుటూరులో ఓ నేత వలంటీర్లపై ఒత్తిడి తెస్తున్నట్లు చెబుతారు. రాజీనామాలు చేసి ప్రచారంలో పాల్గొనండి అంటూ వలంటీర్లపై బాగా ఒత్తిడి తెచ్చారు. ప్రొద్దుటూరులో మాదిరి జిల్లా వ్యాప్తంగా అమలు చేసేందుకు వైసీపీ నేతలు ప్లాన్ చేశారు. అయితే ప్రొద్దుటూరు ఫార్ములా బెడిసికొట్టింది. ఇప్పటివరకు 600పైచిలుకు వలంటీర్లు రాజీనామా చేసినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే ఎక్కువ ప్రొద్దుటూరు నియోజకవర్గంలోనే ఉండడం గమనార్హం. ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో 798 మంది వలంటీర్లు ఉండగా 68 మంది రాజీనామా చేశారు, ఎన్నికల విధుల్లో పాల్గొన్నందుకు 6 మందిని తొలగించారు. ప్రొద్దుటూరు మండలంలో 612 మంది వలంటీర్లు ఉంటే 142 మంది రిజైన్ చేశారు, ఇద్దరిని తొలగించారు. ఇక జిల్లా వ్యాప్తంగా 600 పైచిలుకు మంది మాత్రమే రాజీనామాలు చేశారు. వైసీపీ నేతలు పిలుపిస్తే వలంటీర్లందరు రాజీనామా చేస్తారని భావించారు. అయితే వలంటీర్ల స్పందన అంతంతమాత్రమే ఉండగా వైసీపీ నేతలు అవాక్కయినట్లు చెబుతారు.

రాజీనామా చేస్తే భవిష్యత్తు ప్రశ్నార్థకం..

సాక్షాత్తు సీఎం జగన్ వలంటీర్లే తన సైన్యం అని పదేపదే చెబుతున్నారు. తాను తిరిగి సీఎంగా కొలువు తీరగానే వలంటీర్ల నియామకంపైనే తొలి సంతకం చేస్తానని కూడా ఇటీవల ప్రకటించారు. ఒకవేళ వైసీపీ ఓడిపోతే.. జగన్ సీఎం కాకపోతే.. తమ భవిష్యత్తు ఏమిటి అనే ఆలోచనలో వలంటీర్లు ఉన్నారు. ఇప్పుడు రాజీనామా చేసి ప్రచారాలకు వెళితే.. పక్కా వైసీపీ అని అందరికీ స్పష్టం అయిపోతుంది. టీడీపీ అధికారంలోకి వస్తే.. తమకు ఉద్యోగాలు ఇవ్వకుండా, ప్రభుత్వం నుంచి ఎలాంటి లబ్ధి అందకుండా చేస్తే పరిస్థితి ఏమిటి? అని వీరు ఆందోళన చెందుతున్నారు. అందుకనే చాలామంది వలంటీర్లు రాజీనామా చేయడానికి సుముఖంగా లేరని అంటున్నారు.

టీడీపీ వస్తే రూ.10వేలు హామీ

వలంటీర్ వ్యవస్థకు తాము వ్యతిరేకం కాదని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు వెల్లడించారు. టీడీపీ అధికారంలోకి వస్తే వారి వేతనాన్ని రూ.10వేలకు పెంచుతామని హామీ ఇవ్వడం వలంటీర్లకు మంచి బూస్టింగ్ అయింది. జగన్ గొడ్డుచాకిరీ చేయించుకోవడం తప్ప వారి పనులకు తగ్గట్టు వేతనాలు ఇవ్వలేదనే ఆక్రోశం వలంటీర్లలో ఉంది. ఉగాది పురస్కారాలతో మమ అనిపించారు అంటున్నారు. అయితే చంద్రబాబు రూ.10వేలు వేతనం ఇస్తామని చెప్పడంతో వలంటీర్లలో ఆశలు చిగురించాయి. రూ.200 ఉన్న పింఛన్‌ను చంద్రబాబు రూ.2000 వేలు చేశారు. జగన్ ఐదేళ్లలో రూ.1000మాత్రమే పెంచారు. చంద్రబాబు ప్రకటనపై వలంటీర్ల నుంచి సానుకూల స్పందన వచ్చిందంటున్నారు. వలంటటీర్లతో రాజీనామా చేయించి వారితో ప్రచారానికి వెళితే వారి పరిధిలో ఉన్న ఓట్లు పడతాయని వైసీపీ నేతలు భావిస్తూ వచ్చారు. ఇపుడు రాజీనామా పిలుపునకు వలంటీర్లలో స్పందన అంతంతమాత్రమే ఉండడంతో వైసీపీలో ఆందోళన మొదలైంది.

అనుమతులు లేకుంటే చర్యలు

- జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు

కడప(కలెక్టరేట్), ఏప్రిల్ 10: ఎన్నికల ప్రచార కార్యక్రమాలకు ముందస్తు అనుమతులు పొందాలని, లేకపోతే చర్యలు తప్పవని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై జాయింట్ కలెక్టర్ గణేశ్‌కుమార్, డీఆర్వో గంగాధర్ గౌడ్, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రచారం చేసే రాజకీయ పార్టీలు తప్పనిసరిగా ఆయా రిటర్నింగ్ అధికారుల వద్ద అనుమతులు తీసుకోవాలన్నారు. ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ ద్వారా మోడల్ కోడ్ ఉల్లంఘనలపై చర్యలు, ప్రత్యేక పర్యవేక్షణ తీసుకుంటున్నామన్నారు. ఎక్కడైనా ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడుతుంటే ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. అనుమతులు లేకుండా ప్రచారాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నాయకుల ర్యాలీలు, స్టార్ క్యాంపెయినర్లు, రోడ్ షో లాంటి కార్యక్రమాల కోసం 48 గంటల ముందే అనుమతి తీసుకోవాలన్నారు. డోర్ టు డోర్ ప్రచారానికి కూడా పర్మిషన్ ఉండాలన్నారు. ఓటర్ల జాబితాకు సంబంధించి ఈనెల 17వ తేదీ లోపు అన్ని రకాల ఫారాలకు సంబంధించి అభ్యర్థనలు పరిశీలించి పూర్తి చేస్తామన్నారు. ప్రింట్ అండ్ , ఎలక్ట్రానిక్, సోషియల్ మీడియాలో ప్రచార ప్రకటనలు, బహిరంగ ప్రచారాలకు ఉప యోగించే అసైన్‌మెంట్, బ్యానర్లు, పోస్టర్లు, కరపత్రాలు వంటి వాటికి మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ నుంచి ముందస్తుగా అనుమతి తీసుకోవాలన్నారు ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బి.హరిప్రసాద్ (టీడీపీ), జి.లక్ష్మణ్ రావు(బీజేపీ), సుధాకర్ పాల్ (కాంగ్రెస్), మల్లికార్జున్ (వైసీపీ), కానగ దానం (బీఎస్పీ), మనోహర్ (సీపీఎం) తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డులను బదిలీ చేయండి

- ఎన్నికల కమిషన్‌కు ఎమ్మెల్సీ లేఖ

పులివెందుల టౌన్, ఏప్రిల్ 10: జిల్లాలో 2019 తర్వాత నియామకం అయిన హోంగార్డులను ఇతర జిల్లాలకు బదిలీ చేయాలని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌కు లేఖ రాశారు. సీఎం జగన్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆయనకు ప్రైవేట్ సెక్యూరిటీగా ఉన్నవారిని, వారి వద్ద పనిచేసిన వారందరినీ కడప జిల్లాలో హోంగార్డులుగా నియమించారని ఆ లేఖలో పేర్కొన్నారు. వీరు జిల్లాలో ఉంటే అధికారులను తప్పుదారి పట్టించే అవకాశం, అలాగే విషయాలను వైసీపీ నాయకులకు చేరవేసే అవకాశం ఉందని తెలిపారు. వీరిని ఇతర జిల్లాలకు పంపాలని లేదంటే ఎన్నికల విధుల నుంచి మినహాయించేలా చర్యలు తీసుకోవాలని సీఈసీకి లేఖ ద్వారా రామగోపాల్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

వైసీపీ ప్రచారంలో హోంగార్డు

- పత్రికల్లో కథనాలు వస్తే తప్ప.. స్పందించని ఎన్నికల నిఘా టీం



వైసీపీ ర్యాలీలో పాల్గొన్న హోంగార్డు మంజుల నాగ మునీంద్ర

కడప, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): అధికార పార్టీ వైసీపీ వారి ప్రచారంలో ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్ట్ ఉద్యోగులు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది, హోంగార్డులు, వలంటీర్లు ఇంకా పాల్గొంటున్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అమలు చేయవలసిన ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, విజువల్ సర్వేలెన్సు టీంలు మాత్రం రాజకీయ పార్టీల ప్రచారంలో పాల్గొంటున్న వీరిని గుర్తించడం లేదు. కేవలం పత్రికల్లో వచ్చే కథనాల మేరకు ఎన్నికల అధికారులు చర్యలు తీసుకోవడం తప్ప వారు స్వతంత్రంగా నిఘా పెట్టి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. మార్చి 30న పులివెందులలో జరిగిన వైసీపీ ఎన్నికల ప్రచారంలో మంజుల నాగమునీంద్ర అనే హోంగార్డు పాల్గొన్నారు. ముఖానికి మాస్కు ధరించి వైసీపీ కార్యాకర్తలతో పాటు ర్యాలీలో పాల్గొన్నారు. ప్రచార రథం వెంట తిరుగుతూ పలుప్రాంతాల్లో వైసీపీ ప్రచారంలో పాల్గొన్నారు. ఇతను పులివెందుల రాజీవ్‌నగర్‌లో నివాసం ఉంటూ వేంపల్లె పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో జిల్లాలో 2019 తరువాత నియమించబడ్డ హోంగార్డులను ఇతర జిల్లాలకు బదిలీ చేయాలంటే ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి చీఫ్ ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

ములాఖత్ సమయం మార్పు



కడప(క్రైం), ఏప్రిల్ 10: కడప సెంట్రల్ జైలులో ఖైదీలను బంధువులు కలిసే సమయాన్ని మార్చినట్లు జైలు పర్యవేక్షణాధికారి ప్రకాశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎండ తీవ్రత, వడగాల్పుల కారణంగా సందర్శకులకు ములాఖత్‌కు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు మాత్రమే నిర్వహించనున్నట్లు తెలిపారు. కావున సందర్శకులు జైలు అధికారులకు సహకరించాలని కోరారు.

కడపలో.. గంజాయ్..!

కడపలో కారం దోశలు, నాటుకోడి రాగి సంగటి, బిర్యాని ఎలా దొరుకుతాయో.. ఇప్పుడు గంజాయి కూడా దొరుకుతుందన్న ప్రచారాన్ని ఇటీవల జరిగిన కొన్ని ఘటనలు నిజమే అనిపిస్తున్నాయి. గంజాయి సేవించే వారిలో యువత, విద్యార్థులే ఎక్కువగా ఉన్నారు. గంజాయి ఆకులే కాదు టాబ్లెట్ల రూపంలో కూడా దొరుకుతుందని తెలుస్తోంది. సీఎం జగన్ సొంత జిల్లాలో విచ్చలవిడిగా దొరుకుతూ యువత మత్తులో దాడులకు పాల్పడడం, వ్యవహరించడం అమ్మాయిల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం విమర్శలకు తావిస్తోంది.

(కడప-ఆంధ్రజ్యోతి): గంజాయి.. ఇది ఒకప్పుడు సాధువులు సన్యాసుల వద్ద ఉండేది. సాధువులంతా కలిసి సిగార్ ద్వారా సేవిస్తూ ఉంటారు. ఎవరో కరుడుగట్టిన మత్తుబానిసలు 50ఏళ్ల పైబడిన వారు ఈ గంజాయి తాగేవారు. జగన్ సీఎం అయిన తర్వాత నో ఏజ్ లిమిట్. ఇది ఒక ప్రాంతానికే కాదు.. యథేచ్ఛగా రాష్ట్రమంతా గంజాయి సరఫరా అవుతోందంటూ టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్, లోకేశ్, బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి విమర్శిస్తూ వచ్చారు. అవును.. వారు చెప్పింది నిజమే. ఇప్పుడు కడపలో కూడా గంజాయి విచ్చలవిడిగా దొరుకుతుంది అంటారు.

గంజాయి గ్యాంగ్ హల్‌చల్

రెండు రోజుల క్రితం కడపలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఓ పార్టీ కార్యాలయం ఎదుట కన్‌స్ట్రక్షన్ బిల్డింగ్‌లో ఆరుగురి బ్యాచ్ గంజాయి సేవిస్తూ ఆ దారినపోయే యువతులను తీవ్రంగా ఈవ్‌టీజ్ చేసినట్లు సమాచారం. గంజాయి బ్యాచ్‌కు తట్టుకోలేక యువతులు పోలీసులకు ఫోన్ చేయగా.. హుటాహుటిన పోలీసులు వచ్చి గంజాయి బ్యాచ్‌ను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో కీలక వ్యక్తి జంప్ అయినట్లు సమాచారం. పోలీసులు తమదైన శైలిలో వారిని విచారిస్తే .. ఈ గంజాయికి డాన్ ఇంగ్లీష్‌లో 'ఎస్' అనే అక్షరంతో ప్రారంభమయ్యే అన్నే తమకు ఇస్తాడని, ఆకే కాదు టాబ్లెట్లు కూడా ఆ అన్నే ఇస్తాడని చెప్పినట్లు సమాచారం. 'ఎస్' అనే వ్యక్తి కోసం పోలీసులు వెంటపడగా ఆయనను ఓ కార్పొరేటర్ కాపాడి వైసీపీ కార్యాలయంలో ఉంచుకున్నట్లు సమాచారం. ఈ విషయం పోలీసులకు తెలియడంతో ఆ వైసీపీ కార్పొరేటర్ కార్యాలయంలోకి వచ్చి సోదాలు నిర్వహించినట్లు చెబుతారు. ఆ కార్పొరేటర్ కీలక వ్యక్తిని కాపాడేందుకు తీవ్రస్థాయిలో పోలీసులపై పులివెందుల పెత్తనాన్ని ఉపయోగిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే పోలీసులు గంజాయి బ్యాచ్‌కు చెందిన సెల్‌ఫోన్లు పరిశీలించగా వారి గ్రూపుల్లో ఏ ఆకు బాగా మత్తు ఇస్తుంది, టాబ్లెట్లు, ఆకును ఎలా నలపాలి, ఎలా తాగాలి అనే వీడియోలు కనిపించడంతో అవాక్కయినట్లు తెలిసింది. విచారణ మొదలుపెడితే గంజాయి వెనుక ప్రముఖులే ఉన్నట్లు, వైసీపీ బడానేతల పేర్లే బయటకు వస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. అయితే ఎలాగైనా సరే కీలక వ్యక్తిని తప్పించాలని ఆ కార్పొరేటర్ ప్రయత్నిస్తుండడం గమనార్హం. గంజాయి బ్యాచ్‌తో కడపకు చెందిన పలువురు వైసీపీ నేతలకు సంబంధాలు ఉన్నాయని, వారి దౌర్జన్యాలకు, కబ్జాలకు గంజాయిమత్తులో సహకరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.



గంజాయి బ్యాచ్ చేతుల్లో కత్తిపోట్లకు గురైన యువకుడు

రెచ్చిపోతున్న గంజాయి బ్యాచ్

మూడేళ్లుగా కడపలో తోటకూర, మెంతికూర, మునగాకు.. ఇలా ఆకుకూరల మాదిరిగా గంజాయి దొరుకుతుందంటారు. గంజాయి ఉత్తరాంధ్రకు ప్రసిద్ధి. అయితే అక్కడి నుంచి కడపకు రావడం ఆకుకూరల మాదిరి ఇక్కడ దొరకడం ఆందోళనకు గురిచేస్తోంది. గంజాయికి అలవాటు పడ్డ యువత క్షణికావేశంలో ఏంచేస్తున్నామో తెలియని మత్తులోకి వెళ్లి దాడులు, టీజింగ్, వికృతచేష్టలకు పాల్పడుతున్నారు. గంజాయి బ్యాచ్ ఆగడాలను బయటకు చెప్పుకొంటే పరువు పోతుందన్న భయంతో మహిళలు కొందరు లోలోన కుమిలిపోతున్నారు. కడపలో కార్పొరేట్ ఇంజనీరింగ్ కళాశా లల్లో గంజాయి వాడుతున్నట్లు చెబుతున్నారు. వాట్సప్, టెలిగ్రామ్, ఇన్‌స్టాగ్రామ్‌లో పరస్పరం సమాచారాన్ని చేరవేసుకుంటున్నారని అంటున్నారు. రెండు రోజుల క్రితం ఆర్టీసీ బస్టాండ్ నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లేదారిలో అర్ధరాత్రి పూట ఓ గంజాయి బ్యాచ్ బీభత్సం సృష్టించింది. రైల్వేస్టేషన్ నుంచి బస్టాండ్‌కు వస్తున్న ప్రయాణికులపై ఆ గ్యాంగ్ దాడులకు పాల్పడిందంటారు. ఆ దారిన వెళ్తున్న సోషల్ వర్కర్ దాడిని ఖండిస్తే అతనిపై దాడికి పాల్పడ్డారని అంటున్నారు. ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళితే 100కు ఫోన్ చేయండి వాళ్లు మాకు ఫోన్ చేస్తారంటూ నిర్లక్ష్యంగా చెప్పారని అంటున్నారు. చివరకు ఇష్యూ పెద్దది కావడంతో పోలీసులు అక్కడకు వచ్చారు. ఈ ఘటన రైల్వేస్టేషన్, బస్టాండ్ వెళ్లాలనుకున్న ప్రయాణికుల్లో భయం కలిగిస్తోంది. ఇటీవల కొన్ని పరిశీలిస్తే ఫిబ్రవరిలో గంజాయిమత్తులో ఓ బ్యాచ్ కత్తులతో గొడవలకు దిగి బెదిరిస్తుండడంతో పోలీసులు అరెస్టు చేశారు. మార్చి 19న గంజాయి బ్యాచ్ ఓ యువకునిపై దాడి చేసింది. మార్చి చివరి వారంలో గంజాయిమత్తులో ఐటీఐ వద్ద కత్తితో దాడి చేశారు. ఇవి కొన్ని మాత్రమే. ప్రశాంతమైన కడపలో గంజాయి గ్యాంగులు తిరుగుతూ స్థానికులను కంటిమీద కునుకులేకుండా చేస్తోంది.



రెండు రోజుల క్రితం రైల్వేస్టేషన్ రోడ్డులో గంజాయి బీభత్సం తర్వాత పోలీసుల పహారా

యువతిని ఈవ్‌టీజింగ్ చేసిన గంజాయి బ్యాచ్

- పోలీసుల అదుపులో ముగ్గురు యువకులు


కడప(క్రైం), ఏప్రిల్ 10: కడప నగరం హౌసింగ్ బోర్డు కాలనీలో కొందరు యువకులు గంజాయి సేవించి దారిలో ఒంటరిగా పోతున్న యువతిని ఈవ్‌టీజింగ్ చేశారు. స్థానికులు గుర్తించి ఒన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన కొంతమంది యువకులు జులాయిగా తిరుగుతూ గంజాయి సేవిస్తు వచ్చి పోయే వారిని వేధింపులకు గురిచేస్తున్నారు. వీరు రోజంతా హౌసింగ్ బోర్డు కాలనీలో బ్యాచ్‌లుగా తిరుగుతూంటారు. రెండురోజుల క్రితం ఒంటరిగా వెళుతున్న యువతిని అడ్డగించి అసభ్యంగా మాట్లాడారు. దీంతో స్థానికులు, బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ముగ్గురిని అదులోకి తీసుకోగా మిగిలిన యువకులు పరారయ్యారు. వారికోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టినట్లు సమాచారం.

నకిలీలకు పింఛన్లు

చాలా ఏళ్లుగా ప్రభుత్వాలు దివ్యాంగులకు మానవతా దృక్పథంతో పింఛన్లు అందజేస్తున్నాయి. దీనినే కొందరు అవకాశంగా మలచుకున్నారు. అంగవైకల్యం లేకున్నా ఉన్నట్టుగా.. ఇతర జిల్లాల ఆసుపత్రుల పేరుతో నకిలీ సదరం సర్టిఫికెట్లు సమర్పించి పింఛన్లు పొందుతున్నారు. ఇలాంటివి ఒక్క పులివెందుల నియోజకవర్గం పరిధిలోనే 255 ఉన్నట్టు అధికారులు గుర్తించారు. వీరందరికీ నోటీసులు పంపించారు.

- 255 నకిలీ సదరం సర్టిఫికేట్లు
- పులివెందులలో గుర్తించిన అధికారులు
- వికలత్వం నిరూపించుకోవాలని పింఛన్‌దారులకు నోటీసులు

పులివెందుల రూరల్, ఏప్రిల్ 10: సాధారణంగా అంగవైకల్య ధ్రువీకరణ పత్రం పొందాలంటే స్థానికంగా ఉండే ఏరియా ఆసుపత్రులలో.. లేదా జిల్లా ఆసుపత్రులలో నిర్వహించే సదరం క్యాంప్‌లకు హాజరు కావాల్సి ఉంటుంది. వైకల్యం రావడానికి గల కారణాలు, గతంలో చికిత్స పొందిన రిపోర్టులు, చికిత్స కాలం ఎన్నిరోజులు.. ఇలా పలు అంశాలను పరిశీలిస్తారు. అనంతరం డాక్టర్లు పరీక్షలు జరిపి వికలత్వ శాతాన్ని సూచిస్తూ సదరం సర్టిఫికేట్లు మంజూరు చేస్తారు. ఇలాంటి సదరం క్యాంప్‌లు నిర్వహించేందుకు పులివెందుల ఏరియా ఆసుపత్రిలో అనుమతులు ఉన్నాయి. అయినా కొంతమంది ఇతర జిల్లాల సదరం క్యాంప్‌లకు వెళ్లి సర్టిఫికెట్లు తెచ్చుకుంటున్నారు. పులివెందుల నియోజకవర్గంలో 255 నకిలీ సర్టిఫికెట్లు పొందినట్లు అధికారులు గుర్తించారు. వీరంతా జీసీహెచ్ సత్తెనపల్లె, జీజీహెచ్ గుంటూరు, జీసీహెచ్ వినుకొండతో పాటు ఇతర జిల్లాల మెడికల్ బోర్డుల నుంచి సర్టిఫికెట్లు పొందినట్లు తెలిసింది.



ఈ ఏడాది జనవరిలో పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి నియోజకవర్గంలోని ఎంపీడీఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కొందరు నకిలీ సదరం సర్టిఫికేట్‌లు సమర్పించి పింఛన్లు పొందుతున్నారని ఓఎస్డీకి తెలియజేశారు. ఇతర ప్రాంతాల నుంచి సదరం సర్టిఫికెట్లు పొందిన వారి జాబితా సేకరించాలంటూ ఎంపీడీఓలతో పాటు పులివెందుల మున్సిపల్ కమిషనర్‌కు ఓఎస్డీ లేఖ రాశారు. దీంతో నియోజకవర్గంలోని చక్రాయపేట, లింగాల, సింహాద్రిపురం, తొండూరు, వేంపల్లె, వేముల, పులివెందుల మండలాలతో పాటు పులివెందుల మున్సిపాలిటీలో పింఛన్‌దారుల జాబితాను తయారు చేశారు. నియోజకవర్గంలో 255 మంది ఇతర ప్రాంతాల నుంచి సర్టిఫికెట్లు పొందారని గుర్తించారు. ఈ జాబితాను కలెక్టర్‌కు పంపడంతో పాటు ధ్రువీకరణ పత్రాలు పొందిన వారిని పునః పరిశీలన చేసేందుకు అవకాశం ఇవ్వాలని ఓఎస్డీ కోరారు. జాబితాలో ఉన్న 255 మంది పులివెందుల ఏరియా ఆసుపత్రిలో వికలత్వాన్ని నిరూపించుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఆ మేరకు ఎంపీడీఓ మరియు మున్సిపల్ కమిషనర్‌లు పింఛన్‌దారులకు నోటీసులు జారీ చేశారు. అయితే ఇప్పటివరకు కొంత మంది క్యాంప్‌నకు హాజరుకాలేదని తెలిసింది. హాజరుకాని వారికి మళ్లీ నోటీసులు ఇస్తారా లేక గతంలో పొందిన పింఛన్ నగదు రికవరీ చేస్తారా లేక మరేమైనా చర్యలు తీసుకుంటారా అనేది వేచి చూడాల్సిందే. ఇదిలా ఉండగా.. ఈ వ్యవహారంలో మరింత లోతుగా విచారణ జరిపితే వేలల్లో నకిలీలు బయటపడతాయని కొందరు అధికారులు బహిరంగంగా అంటున్నారు.



వాస్తవమే..

సదరం నకిలీ ధ్రువీకరణ పత్రాలు పొందిన వారిని గుర్తించామని పులివెందుల మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, ఎంపీడీఓ దివాకర్ ఆంధ్రజ్యోతికి తెలిపారు. జాబితా ప్రకారం అందరికి నోటీసులు జారీ చేశామన్నారు. తదుపరి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

నేడే రంజాన్

- సామూహిక నమాజు కోసం ముస్తాబైన ఈద్గాలు



బిల్టప్ వద్ద ఈద్గాలో సామూహిక ప్రార్థనల కోసం చేపట్టిన ఏర్పాట్లు

కడప (కల్చరల్), ఏప్రిల్ 10: కఠిన ఉపవాసాలతో 30 రోజులు గడిపిన ముస్లింలు రంజాన్ మాసం ముగింపు సంకేతంగా గురువారం ఈతుల్ ఫిత్ర్ (రంజాన్) పండుగ జరుపుకోనున్నారు. గల్ఫ్ దేశాల్లో బుధవారం పండుగ పూర్తయిపోవడంతో మన దేశంలో గురువారం జరుపుకుంటున్నారు. 30 రోజుల ఉపవాసాలు, దానధర్మాలు, తరావీహ్ నమాజులు, జకాత్, ఫిత్రా దానాలతో క్షణం తీరిక లేకుండా గడిపిన ముస్లింలు రంజాన్ పండుగ సందర్భంగా తమ గ్రామ ఈద్గాలలో సామూహిక ప్రార్థనలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా గురువారం జిల్లాలోని ఈద్గాలలో పండుగ నమాజు ఉండడంతో ఆయా ఈద్గాల కమిటీ సభ్యులు వాటిని బుధవారం సుందరంగా అలంకరించారు. ఆ క్రమంలో బుధవారం జిల్లాలోని ఈద్గా మైదానాలతో పాటుగా కడప నగర బిల్టప్ సమీప ఈద్గా మైదానం... అలాగే దండు సమీప మురాదియా షాహి ఈద్గా మైదానం ముస్తాబయ్యాయి.

కిటకిట లాడిన వైవీ స్ట్రీట్

గురువారం రంజాన్ పర్వదినం కావడంతో కడప నగరంలోని వైవీ స్ట్రీట్, టీకేఎం స్ట్రీట్, మద్రాస్ రోడ్డు, పాతబస్టాండు, ఆర్టీసీబస్టాండ్ అంబేడ్కర్ సర్కిల్‌లోని వ్యాపార సముదాయాల వీధులన్నీ ముస్లింలతో కిటకిటలాడాయి. వస్త్ర దుకాణాలు, బంగారు, చెప్పులు.. మెహందీ, గాజులు, అత్తర్, పూలు, డ్రైఫ్రూట్స్, తదితర అంగళ్లు కొనుగోలుదారులతో కిక్కిరిశాయి. ఇందులో ప్రధానంగా వైవీ స్ట్రీట్ జనంతో నిండిపోయింది. ఎక్కడ చూసినా రంజాన్ కోలాహలం కనిపించింది.




ఎండిన పొలంలో మేతమేస్తున్న గేదెలు

కమ్ముకుంటున్న కరువు ఛాయలు

- నీరు, మేతలేక అలమటిస్తున్న మూగజీవాలు
- వలసబాట పట్టిన గొర్రెల కాపారులు
- గత్యంతరం లేక సంతల్లో విక్రయిస్తున్న వైనం

లక్కిరెడ్డిపల్లె, ఏప్రిల్ 10: అసలే కరువు ప్రాంతం... గత ఐదేళ్ల నుంచి అర కొర వర్షాలతో సాగుచేసిన పంటలు చేతికందక రైతన్నలు అప్పులు ఊబిలో కూరుకుపోయారు. దీంతో వ్యవసాయం అంటే విసుగు చెందిన రైతులు పాడి పశువులు, మేకలు, గొర్రెలుతో జీవనం సాగిస్తున్నారు. ఈ తరుణంలో ఈ ఏడాది తీవ్ర వర్షాభావం నెలకొనడంతో కరువు చాయలు అలుముకున్నాయి. పంటలు కూడా పెద్దగా సాగుకు నోచుకోలేదు. అరకొరగా సాగుచేసిన పంటలు సక్రమంగా వర్షాలు కురవకపోవడంతో పొలాలల్లోనే వదిలేశారు. దీంతో బతుకుదెరువు కోసం మండలంలో చాలా గ్రామాలలో మేకలు, గొర్రెలు, గేదలు, ఆవులు పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నారు.

మండల వ్యాప్తంగా 10 వేలు మేకలు, 60 వేలు గొర్రెలు, 13 వేల పాడి పశువులు ఉన్నాయి. పాళెంగొల్లపల్లె, అనంతపురం గొల్లపల్లె, పందిళ్లపల్లె, మేడిమాకులగుంత, గొల్లపల్లె, పర్వతరెడ్డిగారిపల్లె, బి.ఎర్రగుడి గ్రామాలలో ఎక్కువగా గొర్రెల కాపరులు ఉన్నారు. పాళెంగొల్లపల్లె, బి.ఎర్రగుడి ప్రాంతాల సమీపంలో శేషాచల కొండలు ఉన్నాయి. ఈ కొండ ప్రాంతంలో ఆకులు అలుములు మేపుకుంటూ జీవాలను పోషించుకుంటున్నారు. అయితే ప్రస్తుతం వేసవిలో తాగడానికి గుక్కెడు మంచినీరు లేక గొర్రెల, మేకల కాపరులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దాహార్తితో కొన్ని జీవాలు మృత్యువాత పడుతున్నాయని గొర్రెకాపరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో దూరప్రాంతాలకు వలసలు వెలుతున్నారు. కొందరు జీవాలను పోషణ భారం కావడంతో రామాపురం, గాలివీడు సంతలకు తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. 10 వేలు అమ్మే గొర్రెలు, మేకలను తక్కువ ధరకు అమ్ముకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇక పాడిఆవులు, గేదలు పరిస్థితి దయనీయంగా ఉంది. ఊర్లల్లో మనుష్యులు తాగడానికి గుక్కెడు మంచి నీరు దొరకడం లేదు ఇక పశువుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది, ఎక్కడేగాని కుంటులు, బావులు, బోర్లల్లో నీరులేక రైతన్నలు గగ్గోలు పెడుతున్నారు. గుక్కెడు మంచినీటి కోసం వ్యవసాయబోర్ల వద్దకు వెళ్లి తెచ్చుకుంటున్నారు. అక్కడ నుంచి పశువులకు నీళ్ల తేవాలంటే సాధ్యం కావడంలేదని చెబుతున్నారు. పాడి పశువులతో రోజుకు 10 నుంచి 20 లీటర్ల పాలను విక్రయిస్తు జీవనం సాగిస్తున్నామని.. నీరులేక పోవడంతో సంతలో విక్రయించాల్సి వస్తోందని వాపోతున్నారు. మేత కోసం వరిగడ్డి కొనాలంటే టాక్టర్ గడ్డి రూ.15000, వేరుశనగకు రూ.20 వేల నుంచి రూ.30 వేలు పెట్టి కొనుగోలు చేస్తున్నామని పలుకుతోందని పాడిరైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా చిత్తూరు నుంచి శైలజాగడ్డి కిలో రూ.7.50ల వంతను టన్ను గడ్డి రూ.7,500లు పెట్టి కొనుగోలు చేసి పాడి పశువులను కాపాడుకుంటున్నామని చెబుతున్నారు. గత ప్రభుత్వంలో పశువులకు తొట్లు కట్టించి అందులో నీళ్ల నింపేవారని.. అంతేకాకుండా దాణా, వట్టిగడ్డి, గడ్డి గింజలను సబ్సిడీ కింద ఇచ్చేవారని.. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం ఎలాంటి కరువు సహాయక చర్యలు చేపట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గడ్డి కొనుగోలు చేసి కాపాడుకుంటున్నా..



వ్యవసాయంలో నష్టాలు రావడంతో మూడేళ్ల నుంచి పాడి ఆవులతో జీవనం సాగిస్తున్నాం. మొత్తం 20 ఆవులు ఉన్నాయి. వీటి కోసం బోరు వేసి గడ్డి సాగుచేసి పాడి ఆవులను కాపాడు కుంటున్నా. కరువుతో బోరులో నీరు ఎండిపోవడంతో శైలజ గడ్డి టన్ను రూ.7500లతో కొనుగోలు చేసి పశువులను కాపాడుకుంటున్నాం. ప్రభుత్వం ఎలాంటి సహాయక చర్యలు చేపట్టలేదు.

- మునిరెడ్డి, కొండవాండ్లపల్లె కోనంపేట

పశువులకు మేత, నీరు కరువు



10 సంవత్సరాల నుంచి పాడిపశువలతో జీవనం సాగిస్తున్నాం. ఫిబ్రవరి నుంచి బోర్లలో నీరు ఎండిపోవడంతో పాడి ఆవులకు నీరు మేత కరు వైంది. గత ప్రభుత్వంలో సబ్సిడీ కింద దాణా, మిక్చర్, గడ్డి గింజలు వంటివి సబ్సిడీతో అందించేవారు. ప్రస్తుత ప్రభుత్వంలో పాడి పశువుల గురించి పట్టించుకోవడం లేదు. టాక్టర్ వేరుశనగ కట్టె కొనాలంటే రూ.25 వేల నుంచి రూ.30వేలు పలుకుతోంది. ప్రభుత్వం ఆదుకోకపోతే పాడి ఆవులను విక్రయించాలనుకుంటున్నాం.

- కొనసాని రాజారెడ్డి, పాడిరైతు, కొనసారివారిపల్లె


వలస వెళుతున్న గొర్రెల కాపరులు


ట్రాక్టర్‌తో వరిగడ్డిని తెచ్చుకుంటున్న రైతులు

దాణా కోసం నివేదికలు పంపించాం..

ఈ ఏడాది వర్షాలు కురవకపోవడంతో పాడిపశువుల కోసం 300 టన్నుల సమీకృత దాణాకు నివేదికలు పంపించాం. మూగజీవాల తాగునీటి కోసం అక్కడక్కడ గ్రామాలల్లో తోట్లు ఉన్నాయి. నీరు నింపేందుకు ఉన్నతా ధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మూగజీవాలను ఆదుకోవాలంటే అదొక్కటే మార్గం. ఈ విషయాన్ని ఉన్నతాదికారులే నిర్ణయించాలి.

- రమేష్, పశువైద్యాదికారి, పందిళ్లపల్లె

ఈవీఎంల భద్రతపై సమీక్ష

- స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించిన కలెక్టరు, ఎస్పీ


అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, ఎస్పీ కృష్ణారావు

రైల్వేకోడూరు(రూరల్) ఏప్రిల్ 10: ఈవీఎంల భద్రతపై కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్ జిల్లా ఎస్పీ కృష్ణారావుతో కలిసి బుధవారం మండలంలోని అనంతరాజుపేట ఉద్యాన కళాశాల వద్ద సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలు మేరకు స్ట్రాంగ్ రూమ్‌లో అన్ని ఏర్పాటు పూర్తి చేశారా లేదా తదితర అంశాలపై కోడూరు రిటర్నింగ్ అధికారి టి.లీలారాణిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అనంతరం వాహనాల పార్కింగ్ ప్రదేశాన్ని పరిశీలించారు. పోలింగ్ విధులకు వచ్చిన అధికారులు సిబ్బంది వాహనాలు ఎక్కడ పార్కింగ్ చేస్తారు, అలాగే పోలింగ్ కేంద్రాలకు తరలించాల్సిన బస్సులను ఏ విధంగా పార్కింగ్ చేస్తారని స్థానిక పోలీస్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాల రూట్ మ్యాపులు, వాహనాల పార్కింగ్ పక్కాగా రూపొందించుకోవాలన్నారు. భద్ర త ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ స్థానిక పోలీస్ అధికారులకు సూచనలు చేశారు. డిస్ట్రిబ్యూషన్ మరియు రిసెప్షన్ ప్రక్రియలను విజయవంతంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో రాజంపేట ఆర్డీవో మోహన్ కుమార్, డీఎస్పీ చైతన్య, సంబంధిత తాహసీల్దారులు, రెవెన్యూ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎటువంటి ఆధారాలు లేని రూ.3,39,500 నగదు పట్టివేత

రాయచోటిటౌన్, ఏప్రిల్ 10: ఎన్నికల నేపథ్యంలో రాయచోటి పట్టణంలోని కడప రోడ్డు మార్గంలో గురువారం ఎస్ఐ జయరాములు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈనేపథ్యంలో అమానుల్లా అనే వ్యక్తి ఎటువంటి ఆధారాలు లేకుండా తీసుకెళుతున్న రూ.3,39,500 నగదును స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న నగదును అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు సీజ్ చేసి ట్రెజరీకి అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు. ప్రజలు ఎవరైనా అత్యవసర పరిస్థితుల్లో కానీ, ఇతర అవసరాల నిమిత్తం కానీ రూ.50వేలకు మించి ఉన్నట్లయితే తగిన ఆధారాలతో నగదును తీసుకెళ్లవచ్చునని తెలిపారు. ఈ తనిఖీల్లో పోలీసు సిబ్బంది రామచంద్ర, జగన్, రామ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బైకును ఢీకొన్న కారు.. ఇరువురికి తీవ్రగాయాలు

ముద్దనూరు ఏప్రిల్ 10: మండల పరిధి ఎర్రగుంట్ల రోడ్డులోని విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో బుధవారం బైకును కారు ఢీకొన్న సంఘటనలో ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు... సింహాద్రిపురం టౌన్‌కు చెందిన అన్నదమ్ములు శశిధర్‌రెడ్డి, జగదీశ్వరరెడ్డి అనే యువకులు బైకులో ఎర్రగుంట్ల వైపు వెళుతుండగా కారు ఢీకొంది. దీంతో ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. ప్రాణాపాయస్థితిలో ఉన్నట్లు తెలుస్తోంది. వీరిని 108లో ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి, ప్రమాదానికి గురైన ద్విచక్రవాహనాన్ని పోలీస్టేషన్‌కు తరలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ముద్దనూరు ఏప్రిల్ 10: కడప, తాడిపత్రి హైవేపై కొత్త చౌటిపల్లె వద్ద ఈ నెల 4వ తేదీన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వెంకటేశ్వర్లు(47) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఏఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. వెంకటేశ్వర్లు అత్తగారి ఇంటికి ముద్దనూరుకు బైకులో వస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. తీవ్రగాయాలవడంతో తిరుపతిలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తెల్లవారు జామున మృతి చెందినట్లు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

కోడిపందెం రాయుళ్ల అరెస్టు

ముద్దనూరు ఏప్రిల్ 10: మండల పరిధి పెద్దదుద్యాల గ్రామంలో బుధవారం కోడిపందెం ఆడుతున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ దస్తగిరి తెలిపారు. 10 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకొని 4 పందెం కోళ్ళు, రూ.7,710 నగదు స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వైభవంగా వద్దిరాల సుంకులాంబ తిరుణాళ్ల


ప్రత్యేక అలంకరణలో సుంకులాంబ అమ్మవారు, సిరిమాను ఊరేగింపు మహోత్సవం

మైలవరం, ఏప్రిల్ 10: మండల పరిధిలోని వద్దిరాలలో వెలసిన సుంకులాంబ పరంజ్యోతి అమ్మవారి తిరుణాళ్ల మహోత్సవాలు గ్రామ పెద్దల ఆధ్వర్యంలో బుధవారం వైభవంగా నిర్వహించారు. స్థానికులే కాక నంద్యాల, అనంతపురం, కర్నూల్ తదితర జిల్లాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుణాళ్లను పురస్కరించుకుని సుంకులాంబ అమ్మవారిని, ఆలయాన్ని ప్రత్యేకంగా విద్యుత్ దీపాలతో అలంకరించారు. సిరిమాను మహోత్సవం వేడకగా నిర్వహించారు. కడప టీడీపీ ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డి, జమ్మలమడుగు బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదినారాయణరెడ్డి, కడప వైసీపీ ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాశ్‌రెడ్డి, జమ్మలమడుగు ఎమ్మెల్యే అభ్యర్థి సుధీర్‌రెడ్డి తదితర నేతలు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. జమ్మలమడుగు, రూరల్ సీఐ గోపాల్‌రెడ్డి, కరుణాకర్ ఆధ్వర్యంలో తలమంచి పట్నం, మైలవరం, ఎస్ఐలు హనుమంతు, రెడ్డిసురేష్, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

భక్తి, శ్రద్ధలతో పెద్ద పీరయ్య స్వామి గ్రామోత్సవం


గ్రామోత్సవంలో ఊరేగుతున్న పెద్దపీరయ్య స్వామి, బండలాగుడు పోటీలు, విజేతలకు బహుమతులు అందజేస్తున్న దాతలు

బ్రహ్మంగారిమఠం, ఏప్రిల్ 10 : ముడుమాల గ్రామం సిద్దయ్య గారి మఠంలోని పెద్ద పీరయ్య స్వామి గ్రామోత్సవం వేడుకగా నిర్వహించారు. ఆరాధన మహోత్సవాల్లో భాగంగా బుధవారం పురవీధుల్లో పెద్ద పీరయ్యస్వామి సమేత నాగులాంబ అమ్మవారిని నిర్వాహకులు ఊరేగించారు. సాయంత్రం వృషభరాజులచే చిన్న బండలాగుడు, పెద్ద బండలాడుగు పోటీలను చేపట్టారు. ఈ పోటీల్లో విజేత వృషభ రాజుల యజమానులకు బహుమతులు అందజేశారు.

కార్యక్రమంలో సిద్దయ్యగారి మఠం యాజమాన్యం, కమిటీ సభ్యులు, నిర్వాహకులు, దాతలు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

తంబళ్లపల్లె, ఏప్రిల్ 10: కర్ణాటక మద్యం కలిగి ఉన్న వ్యక్తిని అరెస్టు చేసి కేసున మోదు చేసినట్లు ఎస్ఐ శివకుమార్ తెలిపారు. .తంబళ్లపల్లె మండలం ఆర్ఎన్ తాండా సమీపంలో కర్ణాటక మద్యం అమ్ముతున్నట్లు సమాచారం రావటంతో ఎస్ ఈబీ ఎస్ఐ వెంకటేష్, తమ సిబ్బందితో కలసి దాడులు చేశారు. ఎద్దుల వేమన్నగారిపల్లెకు చెందిన గోవింద్ వద్ద 180ఎంఎల్ 336 కర్నాటక టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని, అతనిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. నిందితుడిని రిమాండు కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు. సిబ్బంది గోపాలకృష్ణ, రాఘవేంద్ర, కుమార్, రాజేష్ పాల్గొన్నారు.

100లీటర్ల నాటుసారా సీజ్.. ఒకరి అరెస్ట్

వాల్మీకిపురం, ఏప్రిల్ 10: వాల్మీకిపురం మండలంలో 100 లీటర్ల నాటుసారాను పోలీసులు స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేశారు. సీఐ పులి శేఖర్ కథనం మేరకు మండలంలోని చింతపర్తి గ్రామ పంచాయతీ మేకలవారిపల్లెకు చెందిన కె.నాగరాజు(47) సారా అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి 100లీటర్లు నాటు సారా స్వాధీనం చేసుకుని, అతనిని అరెస్టు చేశారు. నిందితుణ్ణి రిమాండు నిమిత్తం కోర్టుకు హాజరుపరిచారు. ఎస్ఐ నాగేశ్వర్‌రావ్ పాల్గొన్నారు.

యాచకురాలు మృతి

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 10: మండలంలోని కొత్తపల్లె సమీప పొల్లాలో గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. కొత్తవారిపల్లె, ఈశ్వరమ్మ ఇండ్లు, ప్రాంతాల్లో యాచిస్తూ జీవనం గడుపుతున్న మహిళగా పోలీసులు గుర్తించారు. ఆమె చని పోయి నాలుగైదు రోజులు గడిచినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహం కుళ్లి పోయి గుర్తు పట్టలేని స్థితిలో కనపించింది. దీంతో అక్కడే పంచనామా నిర్వహించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ సీఐ శేఖర్ తెలిపారు.

ఎన్నికల ప్రశాంత నిర్వహణకు సహకరించాలి

పీలేరు, ఏప్రిల్ 10: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలని జేసీ ఫర్మాన్ అహ్మద్ పీలేరు నియోజకవర్గంలోని రాజకీయ పార్టీలకు సూచించారు. ఎన్నికల ఏర్పాట్లపై బుధవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడారు. ఎన్నికల నిబంధనలు కఠినంగా అమలు చేస్తున్నామని, ఎన్నికల కోడ్ వచ్చినప్పటి నుంచి నియోజకవర్గంలో 5 కేసులు నమోదు చేసి రూ.23.79 లక్షల నగదు జప్తు చేశామన్నారు. ఎన్నికల నియామవళి అతిక్రమించిన 6 మంది కాంట్రాక్టు ఉద్యోగులు, 8 మంది వలంటీర్లను విధుల నుంచి తొలగించామన్నారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు 122 మంది వలంటీర్లు తమ విధులకు రాజీనామా సమర్పించారని వెల్లడించారు. ఇప్పటి వరకు వివిధ రాజకీయ పార్టీల ప్రచార సభలు, వాహనాలకు 163 అనుమతులు మంజూరు చేశామన్నారు. సీ-విజిల్ యాప్ ద్వారా అందిన 8 ఫిర్యాదులను పరిష్కరించా మన్నారు. ఇంటింటి ప్రచారానికి రాజకీయ పార్టీలు ముందస్తు అనుమతి తీసుకోవాలని, కరపత్రాలు పంచడానికి కూడా ముందస్తు అనుమతి తప్పనిసరి అని స్పష్టం చేశారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నిబంధనలను అందరూ విధిగా పాటించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు మహబూబ్ బాషా, ఖతీజున్ ఖుబ్రా, ప్రదీప్, డీటీలు పాల్గొన్నారు.

గర్భిణులు వైద్యుల సలహాలు తప్పక పాటించాలి


గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న దేవ శిరోమణి

రాయచోటిటౌన్, ఏప్రిల్ 10: గర్భిణులు వైద్యుల సలహాలను తప్పనిసరిగా పాటించాలని అన్నమయ్య జిల్లా మాస్ మీడియా అధికారిణి (డెమో) దేవ శిరోమణి అన్నారు. బుధవారం రాయచోటి మండల పరిధిలోని యండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి మాతృవందన యోజన కార్యక్రమాన్ని డాక్టర్ శారద ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మాస్ మీడియా అధికారిణి గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, హాస్పిటల్‌లో వైద్య పరీక్షలు, చికిత్సలతో పాటు ఆరోగ్య పరిరక్షణ కోసం తీసుకోవాల్సిన ఆహార పదార్థాలు, వ్యాయామం, నిద్ర తదితర అంశాలపైన అవాహన కల్పించారు. అలాగే లింగ నిష్పత్తి జిల్లా వ్యాప్తంగా చాలా తక్కువగా 1000 మంది పురుషులకు 742 వంది మహిళలు ఉన్నారన్నారు. సృష్టిలో స్త్రీ, పురుషులు ఇరువురు సమానమన్నారు. ఈ విషయాలను మీ కుటుంబాలకు మీ చుట్టుపక్కల వారికి, మీ స్నేహితులకు అవగావన కల్పించాలని సూచించారు. వేసవి కాలంలో వడదెబ్బ తగలకుండా పసిపిల్లలు, గర్భిణులు, చిన్నబిడ్డలు జాగ్రత్తగా ఉండాలన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్ సుగుణ, సూపర్‌వైజర్ వెంకటేశ్వర్‌రెడ్డి, స్టాఫ్ నర్స్ కవిత, ఆశాలు, వైద్యసిబ్బంది, గర్భిణులు పాల్గొన్నారు.

కడప, పులివెందులలో కాంగ్రెస్ జెండా ఎగరవేయడమే లక్ష్యం

వేంపల్లె, ఏప్రిల్ 10: సార్వత్రిక ఎన్నికల్లో కడప లోక్‌సభ, పులివెందుల అసెంబ్లీ స్థానంలో కాంగ్రెస్ జండా ఎగరవేయడమే లక్ష్యమని మాజీ రాజ్యసభ సభ్యుడు, పీసీసీ మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. బుధవారం వేంపల్లెలో ఆయన మాట్లాడుతూ పులివెందుల తొలి నుంచి కాంగ్రెస్‌కు కంచుకోట అన్నారు. ఇంత వరకు 17సార్లు ఎన్నికలు జరగ్గా 13సార్లు కాంగ్రెస్ గెలిచిందన్నారు. నియోజకవర్గంలో సింహభాగం అభివృద్ధి కాంగ్రెస్ పాలనలోనే జరిగిందన్నారు. పైడిపాళెం రిజర్వాయర్, లింగాల కెనాల్, గండికోట-సీబీఆర్ ఎత్తిపోతల, జేఎన్టీయూ, ట్రిపుల్‌ఐటీ, పశుపరిశోధన కేంద్రం, శిల్పారామం, రింగురోడ్డు, సిమెంటు రోడ్లు, పులివెందుల-కడప నాలుగులైన్ల రోడ్డు ఇవన్నీ కాంగ్రెస్ పాలనలో జరిగాయన్నారు. వేమన యూనివర్సిటీ, కడప రిమ్స్ ఆసుపత్రి, విమానాశ్రయాభివృద్ధి, తెలుగుగంగ, గాలేరు-నగరి ప్రాజెక్టులో సింహభాగం కాంగ్రెస్ పాలనలో జరిగాయన్నారు. జగన్ పాలనలో పులివెందుల అసాంఘిక శక్తుల అడ్డాగా మారిపోయిందన్నారు. మద్యం ఏరులైపారుతోందన్నారు. జూదం, బెట్టింగ్ విచ్చలవిడిగా సాగుతోందన్నారు. డ్రిప్ ఇరిగేషన్ మూలన పడిందన్నారు. అలాగే ఈనెల 12వ తేదీన ఉదయం 10గంటలకు వేంపల్లె, సాయంత్రం 6గంటలకు పులివెందుల, 13వ తేదీ ఉదయం 10:30గంటలకు ఎర్రగుంట్ల, సాయంత్రం 5గంటలకు జమ్మలమడుగు, రాత్రి 7గంటలకు ప్రొద్దుటూరులలో ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిలరెడ్డి పాల్గొంటారని తులసిరెడ్డి తెలిపారు. కాగా.. వేంపల్లెలోని వైఎస్సార్ సర్కిల్ వద్ద కాంగ్రెస్ పార్టీ కళాజాత నృత్య ప్రదర్శనను తులసిరెడ్డి ప్రారంభించారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గుండ్లకుంట శ్రీరాములు, ధ్రువకుమార్‌రెడ్డి, బాబు, అమర్‌నాథ్‌రెడ్డి, ఉత్తన్న, సుబ్బరాయుడు తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అక్రమంగా గాలేరి-నగరి కాల్వ మట్టి తరలింపు

- పట్టించుకోని అధికారులు
- ప్రజాధనం వృథా


అక్రమ రవాణా చేస్తున్న కాల్వ మట్టి

పెండ్లిమర్రి, ఏప్రిల్ 10: మండలంలోని వెల్లటూరు గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న పెద్దదాసరిపల్లె చెరువు సమీపంలో గాలేరు-నగరి కాల్వ తవ్వి వేసిన మట్టిని అక్రమంగా తరలిస్తున్న అధికారులు ఏమిపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. కరువు ప్రాంతమైన రాయలసీమకు తాగు, సాగునీటిని అందించాలనే కృతనిశ్చయంతో కోట్లాది రూపాయలు వెచ్చించి గాలేరు-నగరి కాల్వ పనులను ప్రభుత్వం చేపట్టిందన్నారు. కాల్వ పనులు చేసేటపుడు ఇరువైపుల మట్టిని తవ్వి కట్టగా పోస్తారు. ఈ మట్టిని కొందరు వైసీపీ నేతలు అక్రమ తరలింపు చేస్తున్న అక్రమంగా తరలిస్తూ లక్షలాది రూపాయలు ఆర్జిస్తున్నారు. గత నెల రోజుల నుంచి రాత్రి 9గంటల నుంచి ఉదయం 5గంటల వరకు టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నారు. టిప్పర్ల ద్వారా మట్టిని తరలించడంతో రోడ్లు పాడై పోతున్నాయని ప్రజలు వాపోతున్నారు. రోడ్డు వెంబడి ఉన్న తమపైర్లు దుమ్ము మూలంగా దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో మట్టిని తరలించడం వల్ల టిప్పర్ల శబ్దానికి తమకు నిద్రాభంగం కలుగుతోందని చెబుతున్నారు.

మట్టి అక్రమ తరలింపును అడ్డుకోవాల్సిన అధికారులు ఏమిచేయలేని నిస్సహాయస్థితిలో ఉన్నారు. మండల కేంద్రానికి కూతవేటు దూరంలో మట్టి అక్రమమట్టి రవాణ జరుగుతున్న పోలీసులు గాని, రెవిన్యూ అధికారులు గాని పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గాలేరు-నగరి కాల్వకు నిర్మాణ పనులకు సంబంధించిన మట్టిని నిర్భయంగా కొందరు తరలిస్తున్న ఆ శాఖ అధికారులు ఏంచేస్తున్నారో తెలియడం లేదు. దీని మూలంగా చేసిన పనినే మళ్లీ చేయాల్సి ఉంటుంది. లక్షలాది రూపాయల ప్రజాదనం వృథా అవుతుంది. ఇప్పటికైనా జిల్లా ఉన్న తాధికారులు స్పందించిన తగు చర్యలు తీసుకోవాలని సంబందిత గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

తాగునీటి బోరు చుట్టూ మురుగునీరు

● భూమిలోకి ఇంకిపోతే రోగాలపాలే కదా... ●ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేదు ●ఆందోళనలో కొండపేటవాసులు

చెన్నూరు, ఏప్రిల్ 10 : కొండపేట గ్రామ పంచాయతీ ప్రజలకు తాగునీటిని అందించే బోరు చుట్టూ మురుగునీరు చేరుతోంది. చాలా కాలంగా ఈ మురుగునీరు అలాగే నిల్వ ఉండటంతో భూమిలోకి ఇంకి బోరునీటిలో కలిసిపోవడంతో తాగునీరు కలుషితమవు తోంది. ఆ నీరు తాగి రోగాల బారిన పడతామేమోనని ఆ గ్రామ ప్రజలు ఆందోళన వ్య క్తం చేస్తున్నారు. కొండపేట బ్రిడ్జి వంతెనకు పడమటి భాగంలో కొండపేట వైపు పెన్నానదిలో బోరు ఏర్పాటు చేశారు. ఆ బోరునీరు రుచిగా ఉంటుంది. అయితే ఇటీవల ఆ బోరుకు తూర్పు వైపు ఉన్న ఇళ్లల్లోని మురుగునీరు వీధిగుండా ప్రవహించి పెన్నానదిలోకి వస్తోంది. ఆ నీరంతా పక్కనే బోరు ఉండటంతో అక్కడ గుంతల్లో నిల్వ ఉంటోంది. ఆ నీటిని పక్కకు తరలించండి.. లేదా పైపులు కాస్త దూరంగా వేయండి.. లేకుంటే రోగాలపాలవుతామని స్థానికులు విన్నవిస్తున్నారు. వేసవిలో కూడా మురుగునీరు ఎండిపోవడంలేదంటున్నారు. ఈ విషయంపై గతంలో గ్రామ పంచాయతీ సిబ్బందికి తెలిపినా పట్టించుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు వందల కుటుంబాలకు ఆ తాగునీటి బోరే ఆధారం. అలాంటి బోరు చుట్టూ ఉన్న ప్రాంతం నిత్యం పరిశుభ్రంగా ఉండాలి తప్ప ఇలా మురుగునీటితో ఉంటే ఎలా అని వారు అంటున్నారు. పైగా మురుగునీరు ఎక్కువగా వస్తుండటంతో అక్కడ గుంతలు పడ్డాయి దీంతో మురుగునీరు అక్కడ నిలిచే ఉంటోంది తప్పతరిగే ప్రసక్తే లేదని వారు చెబుతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని ఆ మురుగునీటిని కాస్త దూరంగా మళ్లించి మురుగునీరు తాగునీటి బోరులోకి ఇంకకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. కాగా ఈ విషయమై పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరేందుకు ఆంధ్రజ్యోతి ప్రయత్నించగా ఆయన ఫోను స్విచ్ఛాఫ్‌లో ఉంది.


బోరు చుట్టూ ఉన్న మురుగునీరు


బోరు వద్దకు మురుగునీరు తీసుకువచ్చే పైపు

ఎన్డీయే కూటమిపై దుష్ప్రచారం తగదు

● ముస్లింలు టీడీపీ వెంటే


మాట్లాడుతున్న టీడీపీ మైనార్టీ నాయకులు

వేంపల్లె, ఏప్రిల్ 10: ఎన్డీయే కూటమి అధికారంలోకి వస్తే ముస్లింకు 4శాతం రిజర్వేషన్ రద్దు చేస్తామని వైసీపీ ఫేక్ న్యూస్‌తో దుష్ప్రచారం చేస్తోందని టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మైనార్టీ సెల్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షబ్బీర్, జిల్లా నాయకులు పూల అల్లాబక్షు బుధవారం వేంపల్లెలో విలేకరులతో మాట్లాడుతూ ఓటమి భయంతో వైసీపీ గ్లోబెల్స్ ప్రచారం మొదలు పెట్టిందని, ఇలాంటివి ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. గతంలో కూడా ఎన్డీయే భాగస్వామ్యంలోనే మైనార్టీలకు ఎంతోమేలు చేసిందని గుర్తుచేశారు. షాదీఖానాల నిర్మాణం, హజ్‌యాత్రకు ఆర్థికసాయం, మసీదు మరమ్మతులకు నిధులు, షాదీకా తోఫా, రంజాన్ తోఫా టీడీపీ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. మైనార్టీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధికి చేయూతనిచ్చిందని తెలిపారు. బీజేపీతో పొత్తు ఉన్న టీడీపీ ప్రభుత్వ హయాంలో ముస్లింలకు మంచి జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్, హిదయతుల్లా, షేక్ ఇలియాస్, మహబూబ్ షరీఫ్, పీర, ఫయాజ్, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రార్థనలకు ముస్తాబైన మురాదియ షాహి ఈద్గా

కడప (కల్చరల్) ఏప్రిల్ 10. రంజాన్ పర్వదినం సందర్భంగా గురువారం దండు సమీపంలో వెలసిన చారిత్రాత్మక మురాదియ షాహి ఈద్గా మైదానం ప్రత్యేక ప్రార్థనలకు మాస్తాబయినట్లు ఆస్తాన ఏ మురాదియ ఖలీఫా, మురాదియ షాహి ఈద్గా నాయబ్ ఇమామ్ ఓ ఖతిబ్ సయ్యద్ షా మొహమ్మద్ అక్మల్ పీరా మురాది సాహెబ్ తెలిపారు. బుధవారం స్థానిక రెండవ గాంధీ బొమ్మ సమీప ట్రంకురోడ్ వద్ద గల మురాదియ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. గురువారం ఉదయం 10.45 నిమిషాలకు ఈద్-ఉల్-ఫితర్ నమాజ్ ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభం కానున్నాయన్నారు.

ఘనంగా నారాయణ స్వామి తిరుణాల

సీకేదిన్నె, ఏప్రిల్ 10: చింతకొమ్మదిన్నె మండలం పాపాసాహెబ్‌పే పంచాయతీ బాలుపల్లె సమీపంలోని కమ్మేటిపల్లె నారాయణస్వామి తిరుణాల బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం ఉగాది పండుగ ముగిసిన మరుసటి రోజు ఇక్కడ తిరుణాల జరపడం ఆనవాయితీ. నారాయణస్వామి, రామయ్యస్వామి, కంటిపాపులమ్మలు ఇక్కడ సమాజానికి దూరంగా నాటి దురాచారాలను రూపుమాపి చీడపీడల నివారణ నుంచి ప్రజలను కాపాడినట్లు స్థానికులు చెబుతుంటారు. వారి ఆరాధన మహోత్సవాల సందర్భంగా ప్రతి సంవత్సరం ఇక్కడ గుర్రపు స్వారీలు నిర్వహిస్తుంటారు. స్వామివారికి పూజలు నిర్వహించి భక్తులకు అన్నదానం చేస్తుంటారు. ఈ సందర్భంగా దాతలు మజ్జిగ, మంచినీరు, పానకం తదితర పానీయాలు భక్తులకు అందిస్తుంటారు. భక్తులు మండల వ్యాప్తంగా కాకుండా దూర ప్రాంతాల నుంచి సైతం వచ్చి పూజలు నిర్వహిస్తుంటారు.

అనుమతులు తీసుకోవాలి

● ఆర్డీఓ మధుసూదన్


మాట్లాడుతున్న ఆర్డీఓ, రిటర్నింగ్ అధికారి మధుసూదన్

కడప(కలెక్టరేట్), ఏప్రిల్ 10: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తూచ తప్పకుండా పాటిస్తూ సువిధ యాప్‌లో అనుమతులు తీసుకోవాలని కడప ఆర్డీఓ, ఎన్నికల రిటర్నింగ్ అధికారి మధుసూదన్ అన్నారు. బుధవారం ఆర్డీఓ కార్యాలయంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి, సువిధ యాప్‌లో అనుమతులపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆర్డీఓ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈసీఐ గైడ్ లైన్స్ ప్రకారం రాజకీయ పార్టీలు, అభ్యర్థులు మోడల్ కోడ్ ఆఫ్ కండక్టను పాటించాలన్నారు. పార్టీ సమావేశాలు నిర్వహించుకునే ముందు వేదిక, సయయాన్ని పోలీసులకు తెలి యజేయాలన్నారు. ఇద్దరు, అంతకుమించి అభ్యర్థుల ఊ రేగింపులు ఘర్షణ లేకుండా నిర్వహించుకునేలా ప్రణాళిక ప్రకారం జరుపుకోవాలని సూచించారు. అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఎంసీసీ ఉల్లంఘనపై పరిశీలకులకు నివేదించవచ్చన్నారు సువిధ పోర్టల్ యాప్ ద్వారా నామినేషన్ ఫారమ్‌లు, అపిడవిట్ ఫారమ్- 26లో వారి విరాలను ఆన్‌లైన్‌లో నమో దు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమలో రాజీయ పార్టీల ప్రతినిధులు హరిప్రసాద్, లక్ష్మీనారాయణ, దానం, శ్రీనివాసులు, ప్రసాద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో స్వేచ్ఛాయుత వాతావరణమే లక్ష్యం

● కేంద్ర బలగాలతో పోలీసుల కవాతు


కవాతు నిర్వహిస్తున్న కేంద్ర సాయుధ బలగాలు

కమలాపురం రూరల్, ఏప్రిల్ 10: మే నెలలో జరగనున్న సాధారణ ఎన్నికలలో ప్రజలలో ఉన్న భయాందోళన పోగొట్టి స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించడమే పోలీసుల లక్ష్యమని కమలాపురం సీఐ రామకృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం ఎస్పీ సిద్దార్థ కౌశల్ ఆదేశాల మేరకు కమలాపురం పట్టణంలో కేంద్ర సాయుధ బలగాలతో ఎస్ఐ హృషికేశవరెడ్డి ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా పోలీసులు రక్షణ కల్పిస్తారన్నారు. ప్రజలలో ఉన్న భయాందోళన పోగొట్టి రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా ప్రశాంత వాతావరణం కల్పించడమే పోలీసుల ధ్యేయమన్నారు. ధైర్యంగా ప్రజలు ఓటు హక్కు వినియోగించవచన్నారు.

ట్యూటర్లకు వేతనాలు చెల్లించాలి

బద్వేలు, ఏప్రిల్ 10: జిల్లాలో బీసీ హాస్టళ్ల ట్యూటర్లకు ఏడాది నుంచి పెండింగ్‌లో ఉన్న వేతనాలను ప్రభుత్వం విడుదల చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని డిమాండ్ చేశారు. సుందరయ్య భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా బీసీ సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు ఉదయం, సాయంత్రం బోధించే వారికి సబ్జెక్టుకు రూ.1500 వంతున ప్రభుత్వం అందజేస్తోందని, ఏడాదిగా వారికి ఆ వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, తక్షణమే చెల్లించాలని కోరారు.

నగరాన్ని అధ్వాన స్థితిలోకి నెట్టిన వైసీపీ

● కడప అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి మాధవీరెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, ఏప్రిల్ 10: నగరాన్ని అధ్వాన పరిస్థితిలోకి నెట్టింది వైసీపీనే అని, ప్రజలకు నీళ్లు ఇవ్వలేని స్థితికి స్థానిక పాలకులు చేరుకున్నారని కడప అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి రెడ్డప్పగారి మాధవి దుయ్యబట్టారు. బుధవారం 47వ డివిజన్‌లోని రామలింగచౌడేశ్వరీ దేవి దేవస్థానంలో అమ్మవారికి ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారాన్ని విస్తృతంగా నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి బాబు సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తూ ముందుకు సాగారు. తాము అధికారంలోకి రాగానే ముందుగా చేపట్టే కార్యక్రమాల గురించి ఆమె డివిజన్ ప్రజలకు వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సమస్యలపై అర్ధరాత్రి త నకు ఫోన్ చేసినా స్పందిస్తానన్నారు. ఒక్కసారి టీడీపీ అధికారం వస్తే, పరిశ్రమలు తీసుకువచ్చి మహిళలకు, యువతకు ఉద్యో గ అవకాశాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. మ హిళలకు, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని హా మీ ఇచ్చారు. సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యం అన్నారు. స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.


ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న రెడ్డప్పగారి మాధవీరెడ్డి

ఇఫ్తార్ విందులో శ్రీనివాసరెడ్డి

కడప నగరంలోని సెవెన్ రోడ్స్ మస్జిద్‌లో టీడీపీ తెలుగు యువత రాష్ట్ర నాయకులు జియావుద్దీన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. నాయబ్ మహమ్మద్, ఆరిఫ్, ఇమ్రాన్, జహీర్ తదితరులు పాల్గొన్నారు.


ఇఫ్తార్ విందులో పాల్గొన్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

టీడీపీతోనే అభివృద్ధి, సంక్షేమం: పుత్తా

వల్లూరు, ఏప్రిల్ 10: ఏపీలో సంక్షేమ పథకాలు కొనసాగాలంటే టీడీపీకే సాధ్యమని కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి అన్నారు. మండలంలోని కుమారునిపల్లె, బోరెడ్డిగారిపల్లెలో ఆయన బుధవారం భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి టీడీపీ సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. అరాచక వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపాలని పిలుపునిచ్చారు. వీరివెంట టీడీపీ మండలాధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.


పార్టీలో చేరిన వారితో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి

20 కుటుంబాలు టీడీపీలో చేరిక

కుమారునిపల్లె పంచాయతీలో 20 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. వీరికి పుత్తా నరసింహారెడ్డి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జ్ ఇందిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, బీజేపీ ఇన్‌చార్జ్ గుత్తిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పట్టని ఎన్నికల కోడ్.. తొలగని రంగులు

కమలాపురం రూరల్, ఏప్రిల్ 10: సాధారణ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. కోడ్ దృష్ట్యా రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు, జండాలు, రంగులు ఏదైన బహిరంగ నిషేధం. అయితే కమలాపురం మండలంలోని పొడదుర్తి గ్రామంలో ఎన్నికల కోడ్‌ను పట్టించుకోని అధికారులు ఆ గ్రామంలో ఏర్పాటుచేసిన అధికారపార్టీకి చెందిన జండా దిమ్మెకు రంగులు తొలగించకపోవడం ఎన్నికల కోడ్ ఉల్లంఘనే అవుతుంది. గ్రామస్థాయిలోనే సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి వీఆర్వో గ్రామాలలో తిరిగి పార్టీలకు సంబంధించిన ఎలాంటి గుర్తులు ఉండకుండా తొలగించాల్సిన బాధ్యత వారిదే. అలాంటిది గ్రామాలలో అనునిత్యం ప్రజలు, అధికారులు సంచరిస్తూ ఉన్న ప్రాంతంలోనే ఇలా ఉంటే ఏం చేస్తున్నారో వారికే తెలియాలి. కోడ్ ఉల్లంఘన అని తెలిసి కూడా వారు తొలగించకపోవడం ఏమిటని పలు విమర్శలకు దారిస్తోంది. ఎన్నికల కోడ్ అధికారపార్టీకి వర్తించవని తెలిపారు.


వైసీపీ రంగులతో దర్శనమిస్తున్న జండా స్తంభం

క్రికెట్‌లో మెరిసిన డిగ్రీ కళాశాల విద్యార్థి

వేంపల్లె, ఏప్రిల్ 10: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి హైదరాబాద్ క్రికెట్ లీగ్ మ్యాచ్‌లకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యోగాంజనేయులు, వ్యాయామ విభాగాధిపతి బాలకొండ గంగాధర్ తెలిపారు. పీడీ తేజేంద్ర మాట్లాడుతూ బీఏ ప్రథమ సంవత్సరం చదువుతున్న ఎం.అహ్మద్ కీజర్, మైడెన్ జట్టులో రైట్ హ్యాండ్ మీడియం ఫాస్ట్ బౌలర్‌గా ఎంపికై కియాక్ క్రికెట్ గ్రౌండ్‌లో నెలపాటు జట్టుతో ప్రాక్టీస్‌లో పాల్గొని మే నెలలో జరగబోయే హైదరాబాద్ లీగ్ మ్యాచ్‌లలో మైడెన్ జట్టులో ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల లైబ్రరీ విభాగాధిపతి మాధవరావు, అధ్యాపక మరియు అధ్యాపకేతర సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.


ఎంపికైన విద్యార్థితో ప్రిన్సిపాల్, పీడీ తదితరులు

నిత్యావసర సరుకులు పంపిణీ

కడప ఎర్రముక్కపల్లి, ఏప్రిల్ 10: కడప నగరం ఎన్జీఐ కాలనీలో ఉన్న పీస్ ఇస్లామిక్ ఇంటర్‌నేషనల్ హైస్కూల్‌లో పవిత్రమైన రంజాన్ మాసంను పురస్కరించుకుని ఉపవాస దీక్షపరులకు బిర్యాని, పేదలకు ఉచితంగా నిత్యావసర సరుకులను పీస్ విద్యా సంస్థల అధినేత అంతర్జాతీయ అవార్డు గ్రహీత సయ్యద్ గౌస్‌పీర్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లడుతూ సామాజిక సేవలో తాను ముందు ఉంటామన్నారు.


2741 సరుకులు పంపిణీ చేస్తున్న గౌస్‌పీర్

ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం కల్పిస్తాం

జమ్మలమడుగు, ఏప్రిల్ 10: పార్టీలో ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం కల్పిస్తామని టీడీపీ ఎన్డీయే కూటమి ఎంపీ అభ్యర్థి చదిపిరాళ్ల భూపేశ్‌రెడ్డి ప్రకటించారు.

- టీడీపీ కడప ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో జి.ఉప్పలపాడులో టీడీపీలో చేరికలు
- పోరుమామిళ్ల, కాశినాయన, అట్లూరు మండలాల్లో బీజేపీ అభ్యర్థి ప్రచారం

స్థానిక 6వ వార్డు నాగులకట్టలో పలువురికి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఆయన మాట్లాడుతూ జమ్మలమడుగు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి తనకు, కమలం గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో చిన్నాన్న ఆదినారాయణరెడ్డిని గెలిపించాలని ఆయన కార్యకర్తలను, అభిమానులను అభ్యర్థించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి బాలపుల్లారెడ్డి, మైలవరం క్లస్టర్ ఇన్‌చార్జి నెమలి రాజారెడ్డి, మంత్రి శ్రీను, నల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన వారితో కడప టీడీపీ ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డి

జి.ఉప్పలపాడులో టీడీపీలో చేరికలు

మైలవరం, ఏప్రిల్ 10: జి.ఉప్పలపాడు గ్రామస్తులు 10 కుటుంబాలు కడప టీడీపీ ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. మహేష్, కంబగిరి, అంజి, చంద్ర, సంజన్న, గోపాల్ తదితరులకు టీడీపీ కండువా కప్పి పార్టీలోనికి భూపేశ్‌రెడ్డి ఆహ్వానించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, టీడీపీ మండల నేతలు పాపిరెడ్డి, కొండయ్య, సూర్యపెద్దిరాజు, సంజీవ, లక్ష్మయ్య, లక్ష్మీనాయుడు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా : బొజ్జా రోశన్న

పోరుమామిళ్ల ఏప్రిల్10: తనకు ఒక అవకాశం కల్పిస్తే నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జా రోశన్న పేర్కొన్నారు. బుధవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా రంగసముద్రం పంచాయతీ ఎస్టీ కాలనీ, రాఘవేంద్రనగర్, మహబూబ్ నగర్ కాలనీల్లో కరపత్రాలు పంచుతూ ఇంటింటి ప్రచారం చేశారు.

అట్లూరులో విస్తృతంగా బీజేపీ ప్రచారం

అట్లూరు, ఏప్రిల్10: అట్లూరు క్రాస్‌రోడ్డు, చెండువాయి, మద్దూరు, ఉప్పటూరు, కుంభగిరి, వేమలూరు, మణ్యం వారిపల్లె, గుజ్జులవారిపల్లెల్లో మండల టీడీపీ అధ్యక్షులు మల్లికార్జునరెడ్డి, కడప టీడీపీ పార్లమెంటరీ మహిళా అధ్యక్షురాలు సుధారాణి ఆధ్వర్యంలో బుధవారం బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి నేతలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గం ఉమ్మడి బీజేపీ అభ్యర్థి రోశన్నకు ఓటు వేయాలని, కడప పార్లమెంటు టీడీ పీ అభ్యర్థి భూపేష్‌రెడ్డికి ఓటు వేయాలని ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేశారు. దుత్తాయపల్లెలో గంగాధర్ రెడ్డి, మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో పలు కుటుంబాలు టీడీపీలో చేరారు. మండల ఇన్‌చార్జి రెడ్డెయ్య, ఎంపీపీ పొత్తపి రమాదేవి, మండల టీడీపీ మాజీ అధ్యక్షులు అమర్‌నాథరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, యువ నేత జయక్రిష్ణారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, మండల టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు పుల్లారెడ్డి, కె. చిన్నపురెడ్డి, నరసింహారెడ్డి, గంగిరెడ్డి, ఈటె మస్తాన్, నరసారెడ్డి, అల్లం వెంకట సుబ్బయ్య, గురు ప్రసాద్, నరసింహారెడ్డి, జయరామిరెడ్డి, నరసింహులు, కోటపాటి పెంచలయ్య, లక్కిరెడ్డి నారాయణరెడ్డి, పాలకొండు రాజశేఖర్, రాజగోపాల్‌రెడ్డి, మణ్యం రామసుబ్బారెడ్డి, కె.వేణుగోపాల్‌రెడ్డి, ఉప్పతి రామ క్రిష్ణారెడ్డి, వేణు గోపాల్, నిత్య పూజయ్య, వరికుంట సర్పం చ్ రమణ, తదితర నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎస్టీ కాలనీల్లో ప్రచారం చేస్తున్న బీజేపీ అభ్యర్థి రోశన్న

వెంకయ్య కాల్వలో ఘనంగా పెద్దమ్మ దేవర

కొండాపురం, ఏప్రిల్ 10: వెంకయ్య కాల్వలో పెద్దమ్మ దేవర బుధవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, పలువురు నేతలు పాల్గొన్నారు. ఏటా ఉగాదిపార్న రోజు నిర్వహించే ఈ దేవరకు ఈ ఏడాది కూడా పెద్ద ఎత్తున భక్తులు వచ్చి అమ్మవారికి మొక్కుబడులను తీర్చుకున్నారు. తాళ్లప్రొద్దుటూరు తదితర గ్రామాల్లో గ్రామ దేవతలు పెద్దమ్మ, అంకాళమ్మకు పెద్దఎత్తున జంతుబలులు ఇచ్చి మొక్కుబడులను తీర్చుకున్నారు. వెంకయ్య కాల్వలో దేవర సందర్భంగా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఉగాది క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సీఐ కరుణాకర్

జమ్మలమడుగు, ఏప్రిల్ 10: జమ్మలమడుగులో అర్బన్ పోలీసు స్టేషన్ సీఐ చాంబర్‌లో బుధవారం శ్రీక్రోధి నామ సంవత్సర త్రైతసిద్ధాంత ఉగాది (యుగాది) తెలుగు క్యాలెండర్‌ను సీఐ కరుణాకర్ ఆవిష్కరించారు. త్రిమత ఏకైక గురువు ఆధ్యాత్మిక సామ్రాజ్య చక్రవర్తి ఆచార్య ప్రబోదానంద యోగీశ్వరుల ఆశీస్సులతో జమ్మలమడుగులో క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి జమ్మలమడుగు కమిటీ అధ్యక్షుడు రంగనాయకులు, నాగరాజు, వెంకటరెడ్డి, నరసింహ, చలపతి, నారాయణరెడ్డి, రమణ, శ్రీను, మల్లీశ్వరి, రాధిక, సాలమ్మ, పాల్గొన్నారు.

ఓటును సద్వినియోగం చేసుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

గోపవరం, ఏప్రిల్ 10: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కార్యదర్శి నిఖిత అన్నారు. రాచాయిపేట పంచాయతీలో ఓటర్ల అవగాహన సదస్సుపై ర్యాలీలో ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కును ఉపయోగించుకోవాలన్నారు. 80ఏళ్లకు పైబడి, దివ్యాంగ ఓటర్లకు హోం ఓటిం గ్ సదుపాయాన్ని ఎన్నికల కమిషన్ కల్పించిందన్నారు. చెన్నవరం, బెడుసుపల్లె, రాచాయిపేటలో స్వీప్ యాక్టివిటీ ద్వారా అవగాహనను నిర్వహించామన్నారు. మహిళా పోలీస్ నాగేంద్రమణి, వెల్ఫేర్ అసిస్టెంట్ రమణరాజు తదితరులు పాల్గొన్నారు.

మాతా శిశు మరణాలను అరికట్టండి



వైద్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న జిల్లా వైద్యశాఖాధికారి

బద్వేలు, ఏప్రిల్ 10: మాతా,శిశు మరణాలను అరికట్టాలని వైద్య సిబ్బంది తగు చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.నాగరాజు పేర్కొన్నారు. బుధవారం తొట్టిగారిపల్లె ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేపట్టిన ఆయన పలు సూచనలు ఇస్తూ మండలంలోని గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని కష్టతరమైన (హైరిస్క్)గర్భిణులకు సరైన సమయంలో చికిత్స అందించాలని కోరారు. వేసవిలో ఉష్ణోగ్రత ఎక్కువగా ఉన్నందువలన ప్రజలకు వడదెబ్బపై అవగాహన కల్పించాలన్నారు. ఉపాధి కూలీలకు వడదెబ్బ గురించి తెలియజేస్తూ వారికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు విలేజ్ హెల్త్ క్లినిక్, ఆరోగ్య కార్యకర్తల వద్ద అందుబాటులో ఉంచాలని వైద్యాధికారులకు, సిబ్బందికి సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి మల్లేష్, బద్వేలు పట్టణ ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సౌమ్య, జిల్లా ఎపిడిమాలజిస్ట్ ఖాజావుద్దీన్, అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూలి మృతిపై విచారణ జరపాలి

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 10: రాజుపాళెం మండలం కూలూరు గ్రామం కుందూ నది నుంచి మట్టి తవ్వకం కోసం వచ్చిన పెద్ద ఓబులేసు మృతిపై పోలీసులు లోతుగా విచారణ జరపాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ డిమాండ్ చేశారు. ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ చాగలమర్రి మండలం నగళ్లపాడు వాసి పెద్ద ఓబులేసు కుందూ నది నుంచి రాత్రివేళ మట్టి తవ్వడానికి కూలిపనికి వచ్చాడన్నారు. అర్ధరాత్రి నిద్రపోతున్న ఆయనను ట్రాక్టర్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడన్నారు. కొన ఊపిరితో ఉన్న ఆయనను చికిత్స కోసం ప్రొద్దుటూరు కేవీఆర్ ఆస్పత్రికి తీసుకురాగా చికిత్స పొందుతూ మృతిచెందాడని తెలిపారు. ఆయన మృతిపై విచారణ జరిపి వాస్తవాలు వెల్లడించాలని డీఎస్పీని కోరామని ఎస్పీని కూడా కలిసి విచారణ జరపాలని కోరుతామన్నారు. సమావేశంలో ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి బాల లక్షుమయ్య మాదిగ, డప్పు, చర్మకారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ నాగభూషణం మాదిగ, బాల ఓబన్న, తిరుపాలు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేయాలి

బద్వేలు టౌన్, ఏప్రిల్ 10: ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా కేంద్ర సాయుధ బలగాలతో కలిసి బుధవారం సీఐ యుగంధర్ ప్లాక్ మార్చ్ నిర్వహించారు. నాలుగు రోడ్ల కూడలి, సుమిత్రానగర్, శివానగర్, ఆంజనేయనగర్, కోటవీధి, అబ్బరాతివీధి, గాండ్లవీధి, చెన్నంపల్లె, బోవిళ్లవారిపల్లె, చిన్నకేశంపల్లె, విద్యానగర్ కాలనీల్లో సాయుధ బలగాలు తిరగాయి. సీఐ మాట్లాడుతూ కేంద్రసాయుధ బలగాలతో కలిసి సార్వత్రికలో ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా ప్రశాంత వాతావరణం కల్పించడమే పోలీసుల ధ్యేయమన్నారు.

హిందూ ఉపాధ్యాయ సమితి క్యాలెండర్ల అవిష్కరణ

పోరుమామిళ్ల ఏప్రిల్ 10: హిందూ ఉపాధ్యాయ సమితి ఆధ్వర్యంలో క్యాలెండర్లను ఆవిష్కరించినట్లు రాష్ట్రకార్యదర్శి తుపాకుల శ్రీనివాసులు తెలిపారు. లక్ష్మీవెంకటేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సురేష్‌బాబు, వారణాసి రవి, బాలరంగయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు

జమ్మలమడుగు, ఏప్రిల్ 10: చలివెందుల గ్రామం వద్ద బుధవారం సుంకులాంబ దేవి అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కుకున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు, సాయంత్రం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో చలివెందుల, ధర్మాపురం, దేవగుడి, సమీప గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

ట్యూటర్లకు వేతనాలు చెల్లించాలి

బద్వేలు, ఏప్రిల్ 10: జిల్లాలో బీసీ హాస్టళ్ల ట్యూటర్లకు ఏడాది నుంచి పెండింగ్‌లో ఉన్న వేతనాలను ప్రభుత్వం విడుదల చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా బీసీ సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు ఉదయం, సాయంత్రం బోధించే వారికి సబ్జెక్ట్‌కు రూ.1500లు వంతున ప్రభుత్వం అందజేస్తోందని, అయితే ఏడాదిగా వారికి ఆ వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, తక్షణమే వాటిని చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు మస్తాన్ షరీఫ్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

14న ఆవోపా అధ్యక్షుని ఎన్నిక

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 10: ప్రొద్దుటూరు ఆర్యవైశ్య అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ అధ్యక్షుని ఎన్నిక 14వ తేదీ నిర్వహిస్తున్నట్లు ఆవోపా జిల్లా ఎన్నికల అధికారి మాలేపాటి వెంకటరాం తెలిపారు. 13వ తేదీ ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారన్నారు. 14వ తేదీ మిట్టా వెంకటకృష్ణయ్య భవనంలో ఎన్నికలు జరుగుతాయని సాయంత్రం ఫలితాలు ప్రకటిస్తామని తెలిపారు. ఆవోపా సభ్యులందరు ఎన్నికల్లో పాల్గొని ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

వైభవంగా చల్ల కార్యక్రమం

ముద్దనూరు ఏప్రిల్10: స్థానిక రామాలయం వీధి కర్ణమయ్య ఇంటి వద్ద బుధవారం చల్ల నిర్వహించారు. ఉగాది పర్వదినంలో భాగంగా రామాలయం పూజారి రామయ్య ఆధ్వర్యంలో చల్ల ఏర్పాటు చేశారు. తలారి వీధిలో నున్న పెద్దమ్మతల్లికి పూజలు చేసి, ప్రజలకు చల్ల ఏర్పాటుచేశారు. గ్రామంలో ఎటువంటి సమస్య తలెత్తకుండా చల్లగా ఉండేందుకు ఏటా చల్ల పోస్తుంటారు.

దిగుబడి తగ్గిన పసుపు

అనుకూలించని వాతావరణం ● దిగాలుగా రైతన్న

చాపాడు, ఏప్రిల్ 10: ఆరుగాలం కష్టించి పంటలు పండించే రైతన్నకు ఏటా నిరాశే ఎదురవుతోంది. ఏ పంట సాగు చేసినా ఆదాయం మిగలడంలేదు. నష్టం వచ్చినా ఆశ వదులుకోలేక రైతులు మళ్లీ పంటలు సాగు చేస్తున్నారు. వ్యవసాయం జూదంగా మారినా రైతులు ఆరుగాలం పోరాడుతున్నారు. గతేడాది జూలైలో మండలంలో సుమారు 300 ఎకరాల్లో పసుపు సాగు చేశారు. సీతారామపురం, లక్ష్మీపేట, భద్రిపల్లె, రాజుపాళెం, విశ్వనాథపురం, సోమాపురం, పెద్దగురవలూరు గ్రామాల పరిధిలో పసుపు సాగు చేసినట్లు రైతులు తెలిపారు. ఈ ఏడాది వాతావరణం అనుకూలించక దిగుబడి చాలా తగ్గడంతో రైతులు దిగాలుగా ఉన్నారు. రసాయనిక ఎరువులకు కూలి రేట్లు విపరీతంగా పెరిగాయి. సుమారు రూ.లక్ష ఖర్చు అయిందని రైతులు తెలిపారు. ఖర్చు ఎక్కువ, దిగుబడి తక్కువవడంతో రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తవ్విన పసుపును యంత్రాల్లో ఉడకబెట్టి కలాల్లో ఆరబోస్తున్నారు. పదేళ్ల నుంచీ ఎండిన పసుపు క్వింటాలు గరిష్ఠ ధర రూ.7 వేలు పలికింది. కానీ 20 రోజుల నుంచి క్వింటా ధర క్రమంగా పెరుగుతూ గరిష్ఠంగా రూ.15,600లకు చేరింది. మళ్లీ నాలుగు రోజులు నుంచి రూ.14,300లకు తగ్గింది. ఈ ఏడాది పసుపు ధర బాగున్నా దిగుబడి అంతంత మాత్రమే రావడంతో రైతులు నిట్టూర్పునకు గురవుతున్నారు. ధర బాగుండడంతో పలువురు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



రాశిగా పోసిన పసుపు

25 క్వింటాళ్లు పండింది



ఎకరాన్నరలో పసుపు సాగు చేశాను. ఎకరాకు 25 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. గతేడాది 32 క్వింటాళ్లు పండింది. ఎకరా సాగుకు సుమారు లక్ష రూపాయలు ఖర్చు అయింది. రసాయనిక ఎరువులు, కూలి రేట్లు పెరిగాయి. పసుపు పైరు కోత దశకు రావడానికి తొమ్మిది నెలలు పెంచాలి. వ్యవసాయంతో నష్టాలు తప్ప ఆదాయం రావడంలేదు.

లక్ష్మీదేవి, రైతు, సీతారామపురం

ఆశ చంపుకుని సాగు చేస్తున్నాను



పలు రకాల పంటలు పండించి ఆదాయం మిగలడంలేదు. ఆశ చంపుకుని సాగు చేశాను. 24 క్వింటాళ్లు పండింది. ఎకరా సాగు చేసినందుకు సుమారు రూ.90 వేలు ఖర్చు అయింది. ఏటా పసుపును సాగు చేస్తున్నాను. పదేళ్లగా గిట్టుబాటు ధర లభించలేదు. ఈ ఏడాది మాత్రమే క్వింటా రూ.15 వేలు ధర పలుకుతోంది.

బాలవీరారెడ్డి, రైతు, సీతారామపురం

పేదలకు అండ కాంగ్రెస్ అజెండా



ఉప్పలూరులో కాంగ్రెస్ పార్టీలోకి చేర్చుకున్న విజయజ్యోతి

కాశినాయన, ఏప్రిల్ 10: పేదలకు అన్నివిధాలా అండగా నిలిచేది ఒక్క కాంగ్రెస్ పార్టీనని బద్వేలు నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి విజయజ్యోతి పేర్కొన్నారు. బుధ వారం ఉప్పలూరు పంచాయతీ పాత,కొత్తఉప్పలూరు గ్రామాల్లో ఆమె ఇంటింటి ప్రచారం చేశారు. ఆమెకు స్థానిక నేతలు రాజారెడ్డి, రాజు ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలి కారు. అనంతరం వైసీపీ, టీడీపీ నుంచి దాదాపు 30 కుటుంబీకులను కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆమె మాట్లాడుతూ రాజశేఖర్‌రెడ్డి కలలు కన్న సంక్షేమరాజ్యం రావాలంటే ఆయన కూతురు ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిలారెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తుకు ఓటేసి గెలించాలని కోరారు. ఈమె వెంట ఏపీ దళితసమాఖ్య జిల్లా అధ్యక్షుడు రాజు, కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు అన్వర్, కలసపాడు బి.కో డూరు పార్టీ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, గురప్ప, బండి బాల సుబ్బయ్య, బండి రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు

మాజీ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు , ఏప్రిల్ 10: పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు పూర్తి చేసుకుని రంజాన్ పర్వదినం చేసుకుంటున్న ప్రొద్దుటూరు ముస్లింలకు మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో 22వ వార్డు కౌన్సిలర్ వైఎస్ మహ్మద్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

వైభవంగా జ్యోతి ఉత్సవం

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 10: ఆర్టీపీపీ రోడ్డులోని అష్టభుజి మహాచౌడేశ్వరీదేవి ఆలయంలో ఉగాది పర్వదినం సందర్భంగా జ్యోతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం అర్ధరాత్రి ప్రారంభమైన జ్యోతులు బుధవారం ఉదయం వరకు కొనసాగాయి. భక్తులు చౌడేశ్వరీదేవి జ్యోతిని తలపై పెట్టుకుని లయబద్ధంగా నృత్యం చేస్తూ అమ్మవారిని భక్తిశ్రద్ధలతో స్మరించుకున్నారు. చౌడేశ్వరీదేవి అమ్మవారు ప్రజలందరికీ శుభం చేకూర్చాలని వేడుకున్నారు. దారి వెంబడి భక్తులు కాయా కర్పూరం సమర్పించి మంగళహారతులు ఇచ్చారు. ఆలయంలో భక్తులకు అన్నప్రసాద వినియోగం చేశారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు పాణ్యం చిన్నసుబ్బరాయుడు, సురేంద్ర, ఆనంద్, పాల్గొన్నారు.



జ్యోతులు ఎత్తిన భక్తులు